# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 154 గుంటూరు, శుక్రవారం 13- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-









# ఏపీ అసెంబ్లీ సమావేశాలు

## కొనసాగుతున్న ప్రశ్నోత్తరాలు

**అమరావతి, ఫిబ్రవరి 12 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. పుట్టపర్తిలో ఐఐఐటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. ఒంగోలు ఐఐఐటీ తాత్కాలిక క్యాంపస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు మధ్య విద్యార్థులు తిరగాల్సి వస్తోందని, ఇది తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. పుట్టపర్తిలో ఐఐఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సభలో ప్రస్తావించారు. సరైన అనుమతులు లేకుండానే కొందరు కాలేజీలు పెడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధామిస్తూ.. అక్రమాలపై వివరాలు తెలియజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏయే కాలేజీలకు అనుమతులు ఇచ్చారనే దానిపై తన దృష్టికి తీసుకురావాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అలాగే, పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌పై తప్పుడు కుల ధ్రువీకరణ ఆరోపణలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌ను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో అదరికీ తెలుసని.. తప్పుడు సర్టిఫికెట్లతో పదవులు పొందారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రిజర్వ్ స్థానాలను కూడా గత ప్రభుత్వం కాజేసిందని ఆరోపిస్తూ.. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారా అని ఎమ్మెల్యే భాను ప్రకాశ్ ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. జీవో 135లో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. సభ్యులు అడిగినట్లు అదనపు చర్యలు ఏమి తీసుకోవచ్చో పరిశీలిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.



## వెనక్కి తగ్గను..

**న్యూఢిల్లీ: ఫిబ్రవరి 12 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తాను మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశా రు. తనపై సభా హక్కుల తీర్మానం పెట్టినా వెనుకంజ వేసేది లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు గురువారం నాడు ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. తాను నిజమే చెప్పా నని, చెబుతూనే ఉంటానని రాహుల్ పేర్కొ న్నారు.

బడ్జెట్ చర్చలో రాహుల్ ఏమన్నారు?
అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి రాహుల్ గాంధీ లోక్‌సభలో బుధవారం నాడు జరిగిన బడ్జెట్ చర్చలో తీవ్ర విమర్శలు చేశారు. 'అమెరికాతో ట్రేడ్ డీల్‌లో ఎలాంటి లాజిక్ లేదు. భారత్ ఎలాంటి దామాషా ప్రయోజ నాలు పొందకుండానే సాగిలపడింది. ఇరాన్ నుంచో, రష్యా నుంచో, మరో చోట నుంచో చమురు కొనుగోలు చేయాలని అమెరికా ఎలా నిర్ణయిస్తుంది? మీరు భరతమాతను అమ్మేశారు. మీరు సిగ్గుపడాలి. అమెరికా ఒత్తిడితో మోదీ వణికిపోయారు. దేశాన్ని అమ్మే శారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికా కు అప్పగించారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడ్డారు' అని రాహుల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

కాగా, రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే విమర్శించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభలో గురువారం నాడు 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. ఆ కొద్దిసేపటికే రాహుల్ స్పందించారు. తనపై ఎలాంటి హక్కుల తీర్మా నం పెట్టినా నిజమే చెబుతానని, వెనుకంజ వేసేది లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వీడియో షేర్ చేశారు.



## అంబటి రాంబాబుపై పీటీ వారెంట్..

**గుంటూరు, ఫిబ్రవరి 12 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు చట్టపరమైన ఇబ్బందులు తప్పలేదు. సత్తెనపల్లి పోలీసులు గురువారం ఆయనను గుంటూరులోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటన వైసీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. 2023 సంక్రాంతి పండుగ సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి లక్కీ డ్రా నిర్వహించారని ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో బలవంతంగా ప్రజలకు టికెట్లు అంటగట్టారని జనసేన నేతలు ఆరోపించారు. ప్రజలను బెదిరించి టికెట్లు కొనిపించారని, ఇది చట్టవిరుద్ధమని జనసేన నేతలు సత్తెనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సత్తెనపల్లి పోలీసులు గురువారం ఆయనని గుంటూరులోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. అంబటిపై ఉన్న పీటీ వారెంట్ కారణంగా

2లో



## పవన్ కల్యాణ్‌ను కలిసిన బాలకృష్ణ

**ఫిబ్రవరి 12 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు వేర్వేరుగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో బాలకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురు ప్రస్తుత పరిణా మాలు, వివిధ అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఆ తర్వాత నాగబాబు కూడా సోదరుడిని కలిశారు. ఇదిలా ఉండగా, గిద్దలూరు నియోజకవర్గం సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

## ప్రైవేట్ కంపెనీలకు భూముల కేటాయింపుపై శాసనమండలిలో వాడివేడి చర్చ



**అమరావతి, ఫిబ్రవరి 12 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రైవేట్ కంపెనీలకు ఏపీ ప్రభుత్వం భూముల కేటాయింపుపై శాసనమండలిలో గురువారం చర్చ జరిగింది. ప్రైవేట్ కంపెనీలకు భూముల కేటాయింపుపై శాసనమండలిలో వాడివేడిగా చర్చించారు. ఈ చర్చలో భాగంగా ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. ఐదు కంపెనీలకు మాత్రమే 99 పైసలకు భూములు ఇచ్చామని స్పష్టం చేశారు. ఆయా కంపెనీలకు భూములు ఇవ్వొద్దంటే ఎలా? అని ప్రశ్నించారు. క్రెడిబులిటీ కంపెనీలకే భూములు కేటాయింపు జరుగుతోందని తేల్చిచెప్పారు. ఎంవోయూలు కుదుర్చుకున్నాకే కంపెనీలకు భూములు ఇచ్చామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు భూముల కేటాయింపుపై అసెంబ్లీలో చర్చిద్దాం: అచ్చెన్నాయుడు ఏపీ శాసనమండలిలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడారు. భూముల కేటాయిం పు అంశంపై అసెంబ్లీలో చర్చిద్దామని అన్నారు. సంబంధంలేని ప్రశ్నల కు జవాబులు ఎలా చెబుతాం? అని నిలదీ శారు. రహేజా రియల్ ఎస్టేట్ వ్యవస్థ కాదని అన్నారు. మంత్రి ఒప్పుకు న్నారనడం సరికాదని చెప్పుకొచ్చారు. ఆధారాలు చూపిం చకుండానే మళ్లీ అవే ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొ న్నారు.

## సభలో వైసీపీ సభ్యుల తీరుపై స్పీకర్ ఆవేదన



**అమరావతి, ఫిబ్రవరి 12 (క్రైమ్ కౌంటర్ న్యూస్)::** ఏపీ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈరోజు (గురువారం) ఉదయం శాసనసభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పలు నియోజకవర్గాల్లో సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. అనంతరం, నిర్ణీత గడువుకు 10 నిముషాల ముందే ప్రశ్నోత్తరాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. నిన్న (బుధవారం) సభలో వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరును ప్రస్తావించారు. రాజకీయాలు,

2లో



## అంబటి రాంబాబుపై పీటీ వారెంట్..

పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. కోర్టులో ఆయనని హాజరుపరచడంతో.. ఈ కేసులో విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## సభలో వైసీపీ సభ్యుల తీరుపై స్పీకర్ ఆవేదన

చట్ట సభలు, ప్రజాప్రతినిధుల గురించి తెలుసుకుంటారని విద్యార్థులను సభకు పిలిచామన్నారు. ఇలాంటి సమయంలో గవర్నర్ ప్రసంగిస్తుండగా కొందరు సభ్యులు అనుచితంగా వ్యవహరించారని.. కాపీలను చించి విసిరారని తెలిపారు. ఇలాంటివి జరగడం బాధ కలిగించిందంటూ స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'సభా వ్యవహారాలు చూసే పిల్లలకు మనం ఎలాంటి సందేశం ఇస్తున్నాం. ఇవాళ చాలామంది పిల్లలు సభా వ్యవహారాలు చూసేందుకు వచ్చారు. చట్టసభలు, రాజకీయాలు అంటే పిల్లలకు సానుకూలత ఏర్పడాలని వారిని ఆహ్వానించాం. సభ చూసేందుకు వచ్చిన పిల్లలు ఇక్కడి వ్యవహారాలు చూస్తే ఏమనుకుంటారో ఆలోచించాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

## దుర్గి మోడల్ స్కూల్ నందు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం.



క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం. పల్నాడు జిల్లా,దుర్గి లో ఏ పి మోడల్ స్కూల్ నందు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం.పీఎం ఏ పి మోడల్ స్కూల్ నందు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రిన్సిపాల్ ఎస్. ఎం.రెహ్మాన్ ఆధ్వర్యం లో గురువారం ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు యన్.వెంకట శివయ్య స్కౌట్ మాస్టర్ ఎస్.కె. జాన్బీ గైడ్ కెప్టెన్ గాను మరియు 8 మంది విద్యార్థులు గత నెలలో జిల్లాస్థాయిలో శిక్షణ పొంది ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.సి చైర్మన్ సూరే వెంకటేశ్వరరావు పాల్గొని విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ఉత్సాహం చూపించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు.

## చినగంజాంలో సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



చినగంజాం, న్యూస్‌టుడే: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్ ముఖ్యమంత్రి సహాయనిధి కింద చినగంజాం మండలం చింతగుంపల గ్రామానికి చెందిన దారా పరిమళకు అత్యవసర వైద్యం కోసం రూ.3,69,432 విలువైన ఎల్ఓసి చెక్కును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసు మేరకు మంజూరు చేశారు. ఈ చెక్కును నాయకులు, క్యాంపు కార్యాలయ ప్రతినిధులు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## విద్యార్థులకు బాదంపాలు పంపిణీ



వేటపాలెం: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్ జీవీకేసీ స్వామి దయానంద సేవాశ్రమంలోని విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, రావులపేట పంచాయతీ వార్డ్ సభ్యుడు పుటుకూరి కోటి స్వామి గుప్త బాదంపాలు పంపిణీ చేశారు. పౌష్టికాహారం, మానసిక ఉల్లాసం కోసం అల్పాహారంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆశ్రమ విద్యార్థులు స్వామి దయానంద ఆశీస్సులు కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రత్తి వెంకట సుబ్బారావు, సుబ్రహ్మణ్యం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముటుకూరులో రాష్ట్ర స్థాయి వాలీబాల్,కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్.





క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం. పల్నాడు జిల్లా,మాచర్ల నియోజకవర్గం,దుర్గి మండలం,ముటుకూరు గ్రామంలో ఈనెల 26 వ తేదీన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా ఈనెల 24,25 వ తేదీలలో వాలీబాల్,కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అజిత్ తెలిపారు.పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్న కబడ్డీ జట్టుకు లింగా ఫౌండేషన్ చైర్మన్ లింగా శ్రీనివాసరావు రూ .40.వేలు,ద్వితీయ బహుమతికి లింగా సాయి కృష్ణ రూ.20.వేలు పుట్టా భార్గవ్ రూ.10.వేలు మొత్తం రూ.30.వేలు,తృతీయ బహుమతి దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య రూ.20.వేలు,వాలీబాల్ కి ప్రథమ బహుమతి లింగా ఫౌండేషన్ లింగా శ్రీనివాసరావు రూ.20.వేలు,ద్వితీయ బహుమతి ముటుకూరు గ్రామ సర్పంచ్ దొండపాడు చెన్నయ్య రూ.15.వేలు తృతీయ బహుమతి దుర్గి మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోటకూర శ్రీనివాసరావు రూ.10.వేలు ప్రధానం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ పోటీలలో పాల్గొనేవారు ఈనెల 22వ తేదీ లోపు కబడ్డికి రూ.1000,వాలీబాల్ కి రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేయించు కోవాని తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు వసతి,భోజన,సదుపాయం కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.మరిన్ని వివరాలకు 8554040186,9346548150,నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## అంధ ఉపాధ్యాయుడి ఆందోళనకు తెరదించిన కొత్తపేట పోలీసులు

### కారులో మర్చిపోయిన రూ.2 లక్షలు సీసీ కెమెరాల ఆధారంగా తిరిగి అప్పగింత



క్రైమ్ కౌంటర్ న్యూస్,...గుంటూరు జిల్లా... గుంటూరులో ఓ అంధ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆందోళనకు కొత్తపేట పోలీసులు గంటల వ్యవధిలోనే ముగింపు పలికారు. కారులో మర్చిపోయిన రూ.2 లక్షల నగదును వెతికి స్వయంగా ఆయన చేతికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం పేట సన్నిగండ్లకు చెందిన పోట్ల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు (గా+ఉ). తండ్రి వైద్య చికిత్స కోసం నరసరావుపేట నుంచి గుంటూరుకు వచ్చిన ఆయన, సాయంత్రం 4 గంటల సమయంలో వారి తోట 7వ లైన్ వద్ద కారులో దిగారు. అయితే తనతో తెచ్చుకున్న రూ.2 లక్షల నగదు సంచిని కారులోనే మర్చిపోయిన విషయం కొంతసేపటి తర్వాత గమనించారు. ఆందోళనతో వెంటనే కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. సీఐ వీరయ్య చౌదరి మార్గదర్శకత్వంలో క్రైమ్ సిబ్బంది సీసీ కెమెరాలను గంటల తరబడి పరిశీలించారు. కారు నంబర్ లేకపోయినా, బాధితుడు దిగిన సమయాన్ని ఆధారంగా తీసుకుని వాహనాన్ని గుర్తించారు. డ్రైవర్‌ను సంప్రదించి నగదును భద్రంగా స్వాధీనం చేసుకున్నారు. తరువాత ఎస్సై హనుమంతురావు చేతుల మీదుగా రూ.2 లక్షల నగదును లక్ష్మీనారాయణకు అందజేశారు. కష్టసమయంలో తోడుగా నిలిచిన పోలీసులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు....

## బాలికకు మంత్రి రవికుమార్ అండ.. కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



అద్దంకి, న్యూస్‌టుడే: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన బాలికకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అండగా నిలిచారు. మణికేశ్వరం గ్రామ పర్యటనలో భాగంగా ఎస్సీ కాలనీలో నివసిస్తున్న అల్లడి ఏడుకొండలు కుమార్తె ప్రణితి నున్నైన ఆరోగ్య సమస్యను స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.బాలికకు శారీరక పెరుగుదల లోపం ఉండటంతో మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స అవసరమని వైద్యులు సూచించినట్లు తెలిపారు. అయితే రేషన్ కార్డులో పేరు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం వర్తించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు.వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించి, అవసరమైన ధృవీకరణ పత్రాలు తక్షణం జారీ చేయాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు తహశీల్దార్ చరణ్ బాలిక తండ్రికి ధృవీకరణ పత్రం అందజేశారు. దీంతో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచిత చికిత్స పొందేందుకు మార్గం సుగమమైంది. మంత్రి చొరవకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## కాశిపాడుగ్రామంలో బాలల పార్లమెంట్ పిల్లల ప్రమాణ స్వీకారం





క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ : పెద్దకూరపాడు మండలం కాశిపాడు గ్రామంలో బాలల పార్లమెంటు సభ్యులకి ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత బత్తుల బాబు వహించారు .పిల్లలు చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి అన్నారు. పవన్ మాట్లాడుతూ మంచి పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధిలో పాల్గొని దేశాన్ని ముందుకు నడిపించాలన్నారు . ఆ దిశగా గ్రామాల్లో పిల్లలకి బాలల పార్లమెంట్ ఏర్పాటు చేయడం జరుగుతుంది అన్నారు . సంస్థ డైరెక్టర్ సిస్టర్ యాంటో మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసు నుంచే ప్రజల, పెద్దల పట్ల గౌరవం మర్యాద అనే విషయాలు పార్లమెంట్లో పిల్లలకి తెలియజేయడం జరుగుతుందన్నారు. పిల్లలు భవిష్యత్తులో మంచి వ్యక్తులుగా రాణించాలంటే ఇప్పటినుంచే వారికి హక్కులు బాధ్యతలు గురించి తెలియజేయాలన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్రె సాంబయ్య, పంచాయతీ సెక్రటరీ రమేష్ సచివాలయం సిబ్బంది చినబాబు సంపత్,ఆశ వర్కర్ ,బాలల పార్లమెంటు సభ్యులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


# రోంపేరు వరద కాలువ పునరుద్ధరణకు శ్రీకారం

- రైట్ ఆర్మ్ డ్రెయిన్ డ్రెడ్జింగ్‌కు రూ.26.50 కోట్లు
- 75 వేల ఎకరాలకు తొలగనున్న వరద ముప్పు
- ఎమ్మెల్యే ఏలూరి కృషితో ప్రభుత్వ ఆమోదం



**పర్చూరు: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** కృష్ణా డెల్టా పరిధిలోని రోంపేరు వరద కాలువ పునరుద్ధరణ కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి ఫలించింది. బాపట్ల జిల్లాలో రోంపేరు వరద కాలువ పునరుద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రోంపేరు రైట్ ఆర్మ్ డ్రెయిన్‌ను కిలోమీటరు 30.450 నుంచి 37.600 వరకు సుమారు 6.500 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ చేయడానికి రూ.26.50 కోట్ల పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. జలవనరుల శాఖ (ప్రాజెక్ట్స్--××) జారీ చేసిన జీఓ ఆర్‌టీ నెం.59 ద్వారా ఈ ఆమోదం లభించింది. ప్రభుత్వ అనుమతితో పర్చూరు,బాపట్ల, చీరాల మూడు నియోజకవర్గాల పరిధిలో 75 వేల ఎకరాలకు ముంపు సమస్య తీరనుంది. దీర్ఘకాలంగా సిల్ట్ పేరుకుపోవడంతో డ్రెయిన్‌లో నీటి ప్రవాహం మందగించి వరద ముప్పు పెరిగింది. ఫలితంగా పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిపాదిత డ్రెడ్జింగ్ పనులు పూర్తయితే నీటి ప్రవాహ సామర్థ్యం గణనీయంగా పెరిగి వరద ఉధృతి తగ్గనుంది. సుమారు 75 వేల ఎకరాలకు ముంపు ముప్పు తగ్గి, చిన్నగంజాం, పర్చూరు, మార్టూరు,యద్దనపూడి, ఇంకొల్లు ,కారంచేడు, చీరాల, వేటపాలెం, బాపట్ల మండలాల పరిధిలో పంట పొలాలకు రక్షణ కవచంగా నిలవనుంది. మొత్తం 7.500 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనులు చేపట్టే దిశగా చర్యలు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఈ నిధుల మంజూరులో పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషి కీలకమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రోంపేరు డ్రెయిన్ సమస్యపై పలుమార్లు ఉన్నతాధికారులతో సమావేశమై రైతుల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. కృష్ణా డెల్టా పరిధిలో కాల్వలు, డ్రెయిన్‌ల పునరుద్ధరణ అత్యవసరమని వివరిస్తూ సమగ్ర ప్రతిపాదనలు అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితంగా డెల్టా ప్రాంత పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు వెల్లడించారు. సాగునీటి వసతుల బలోపేతంతో వ్యవసాయ రంగానికి బలమైన పునాది వేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. డెల్టా ప్రాంతంలో కాల్వల పునరుద్ధరణ, డ్రెయిన్‌ల శుద్ధీకరణ పనులు దశలవారీగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. రోంపేరు డ్రెడ్జింగ్ ఆ దిశగా కీలక అడుగుగా నిలుస్తోంది. నిధుల మంజూరుతో పర్చూరు, చీరాల పరిసర ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సాగునీటి సమస్యలు తగ్గి పంటల దిగుబడి పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## తండ్రి బాటలో తనయుడు



**బిక్కవోలు క్రైం కౌంటర్ ఫిబ్రవరి12** తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామ పూర్వపు పెద్దలు ఉప సర్పంచ్ స్వర్గీయ మల్లిడి సత్యనారాయణ రెడ్డి అలియాస్ రంగంపేట సత్యనారాయణ రెడ్డి కుమారుడు సత్తి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు కె అర్ కె సంక్షేమ చారిటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు మూడు పూటలా అన్నదానం జరిపించి వారి ఆకలి తీర్చారు. ఈ అన్నదానం లో పాల్గొని ఆకలి తీర్చుకొన్న వృద్ధులు అన్నదాత సుఖీభవ అని సత్తి రెడ్డి ని ఆశీర్వదించారు. స్వర్గీయ రంగంపేట సత్యనారాయణ రెడ్డి ఎంతో కష్టపడి ఉన్నత స్ధానంకి ఎదిగారు. కష్టం విలువ తెలిసిన సత్యనారాయణ రెడ్డి తన పిల్లల భవిష్యత్తు కు బంగారు బాట ఏర్పాటు చేశారు. అంతేకాదు గ్రామంలో ఎవరైనా తనవద్దకు వచ్చి కష్టం చెప్పుకొంటే ఆ కష్టం తీర్చడానికి తానే ముందు ఉండేవారు. పేదవారిని ప్రేమించి వారికి అండగా నిలిచారు. అదే బాటలో వారి కుమారులు కూడా నడవడం విశేషం.

కె అర్ కె ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్య అన్నదానం కి కావలసిన వసతి సౌకర్యం ఏర్పాటు చేసి పేదలందరికి అండగా నిలిచారు.

అంతే కాకుండా సత్తి రెడ్డి తమ ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా ఇక్కడ పేదలను గుర్తుపెట్టుకొని వారి ఆకలి తీరుస్తూఉంటారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కర్రి రామ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు ఇక్కడ ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతంగా సాగడానికి సత్తిరెడ్డి, దొరబాబు సోదరులే, అద్దెలకోసం కూడకుండా భవనం మొత్తం సేవాకార్యక్రమం కు ఇవ్వడం వారి దయాగుణంకు నిదర్శనం అని చెబుతూ సత్తిరెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ఐ హెచ్ఆర్ఎఫ్ లీగల్ సెల్ ఉమెన్ సెల్

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన హైకోర్టు న్యాయవాది చందోలు నాగలక్ష్మి కుమారి




**క్రైమ్ కౌంటర్ న్యూస్ : కర్నూలు** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ×ఎ=ఖీ లీగల్ సెల్ ఓ ఉమెన్ సెల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ గా బాపట్ల జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయవాది చందోలు నాగలక్ష్మి కుమారి కర్నూలు లోని జాతీయ ప్రాంతీయ కార్యాలయం బాధ్యతలు చేపట్టారు ఐ హెచ్ఆర్ఎఫ్ నేషనల్ చైర్మన్ సుప్రీంకోర్టు న్యాయవాది కొంగర అనిల్ కుమార్ గారు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారని ఐ హెచ్ఆర్ఎఫ్ నేషనల్ వైస్ చైర్మన్ ఆర్ కె. కంబగిరి స్వామి గారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వ మానవ హక్కుల పరిరక్షణ లక్ష్యంగా రాజ్యాంగంలోని చట్టాలను పౌరులకు సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేలా సంస్థ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు

## ఆర్ సి యం సి ఎయిడెడ్ పాఠశాల వార్షిక తనిఖీ



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారులు .వై. ప్రసాద్ రావు టి. సత్యనారాయణ మండలంలోని పాటిబండ్ల ఆర్సీఎంసీ పాఠశాలను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు . పాఠశాలలోని అన్ని రిజిస్టర్, రికార్డ్స్ మరియు విద్యార్థుల విద్యాస్థాయి, 75 రోజుల జి ఎఫ్ ఎల్ ఎన్ యాక్షన్ ప్లాన్, ఎస్ ఆర్ కె వి ఎం ఎక్విటెన్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వాటి అన్ని రికార్డ్స్, అసెస్మెంట్ బుక్లెట్స్ , అడ్మిషన్స్, యు డైస్ ప్లస్ ఆన్లైన్ రోల్, విద్యార్థుల ప్రగతి, అన్ని రిజిస్టర్లు పరిశీలించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయ రాణి , ఉపాధ్యాయురాలు . కేశవ కుమారి, బి మేరీ, పౌలిన్ జుత్రుత , క్లస్టర్ రిసోర్స్ టీచర్స్ జి .జ్యోతి వీ.శివ, ఆఫీసు సిబ్బంది ఎన్. జయప్రకాష్ ఎన్. సాంబశివరావు పాల్గొనడం జరిగినది.

## మహాశివోమ్ కార్యక్రమాన్ని పరిశీలించిన కొమ్మాలపాటి శ్రీధర్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** శివరాత్రి మహోత్సవం సందర్భంగా మహా టీవీ ఆధ్వర్యంలో 15 వ తేదీ మహా శివోమ్ కార్యక్రమం నంబూరు లోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మహా టీవీ చైర్మన్ ఎండి మారెళ్ళ వంశీ కృష్ణ తో కలసి పరిశీలించిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

## ఫీజు బకాయిల విడుదలతో విద్యార్థులకు ఊరట: గౌరీ అమర్నాథ్




**చీరాల: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదల చేయడం ద్వారా వేలాది మంది విద్యార్థులకు ప్రభుత్వం ఊరట కల్పించిందని చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో గత ప్రభుత్వం మిగిల్చిన బకాయిలు విడుదల కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా చీరాలలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని గౌరీ అమర్నాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు శరత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మీంచాల సాంబశివరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మారెడ్డి ఆకస్మిక తనిఖీలు



**చిన్నగంజాం: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మారెడ్డి రెండు రోజుల పర్యటనలో భాగంగా బాపట్ల జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పథకం అమలు తీరును విశ్లేషించారు. అనంతరం చిన్నగంజాం జడ్పీహెచ్ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, నిల్వలు, రికార్డు నిర్వహణను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి రాజుబంగారుపాలెం జడ్పీహెచ్ హైస్కూల్‌లో తనిఖీ చేపట్టిన సందర్భంగా రికార్డుల్లో వ్యత్యాసాలు బయటపడ్డాయి. స్టాక్‌లో 60 గుడ్లు అదనంగా ఉన్నట్లు గుర్తించడంతో హెడ్మాస్టర్ ఆర్.వి.ఎస్. పోతురాజును, పథకం నిర్వాహకులను ప్రశ్నించి మందలించారు. ఈ విషయంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని, విద్యార్థులకు సమయానికి నాణ్యమైన ఆహారం అందేలా కఠిన చర్యలు తీసుకుంటామని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

## కొలికపూడి శ్రీనివాస్ పై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ రోజు అసెంబ్లీ లాబీలో కొలికపూడితో పల్లా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు. పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు.

## సినిమా




## ఓపెన్‌గా చెప్పేసిన టాలీవుడ్ నటి


టాలీవుడ్ సీనియర్ నటి వై. విజయ తన సినీ ప్రస్థానంలోని స్టార్టింగ్ డేస్‌ను, ప్రముఖ నటుడు శోభన్ బాబుతో తనకున్న జ్ఞాపకాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. డ్యాన్స్‌పై ఉన్న తనకున్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన వై. విజయ.. తన తొలి చిత్రం కే. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'నిండు హృదయాలు' అని తెలిపారు. అందులో ఒక పేద అమ్మాయి పాటలో నటించానని, డ్యాన్స్‌పై పట్టు ఉండడం వల్ల ఆ సీన్స్ సులభంగా చేయగలిగానని చెప్పారు. ఆ తర్వాత 13 ఏళ్ల వయసులో రామ విజేత ఫిలిమ్స్ నిర్మించిన "తల్లిదండ్రులు" చిత్రంలో నటిగా అవకాశం వచ్చిందని ఆమె గుర్తుచేసుకున్నారు.

ఆ చిత్రానికి హీరోయిన్‌గా ఎంపికవ్వడం చాలా విచిత్రంగా జరిగిందన్నారు. రామ విజేత ఫిలిమ్స్ 18 ఏళ్ల అమ్మాయి కావాలంటూ పేపర్లలో ప్రకటన ఇవ్వగా.. మాస్టర్ ఎం.ఎస్. వై. విజయ పేరును సూచించారు. దాదాపు 2000 ఫోటోలలో నుంచి వై. విజయ ఫోటోను ఎంపిక చేశారు. అయితే సినిమా అంటే తనకు ప్రత్యేకమైన ఆసక్తేమీ ఉండేది కాదని, కేవలం డ్యాన్స్ నేర్చుకోవడమే తన ఉద్దేశ్యమని ఆమె స్పష్టం చేశారు. తను సినీ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేయడంపై తనకు పెద్దగా సంతోషం లేదని, ఎలాంటి కోరికలు లేవని చెప్పారు. అప్పట్లో ఆడపిల్లలకు ఏదో ఒకటి ఉండాలి కదా, ఫేమస్ అవ్వాలి, మంచి బట్టలు వేసుకోవాలి, మంచి పెళ్లి చేసుకోవాలి అని అంటారని, కానీ తన మైండ్‌లో అలాంటివి ఏమీ లేవని విజయ అన్నారు.

తన సినీ ప్రస్థానానికి తల్లిదండ్రులు, తోబుట్టువులు అందించిన సహకారం ఎంతో ఉందని విజయ వివరించారు. ఆమె తల్లి షూటింగ్‌లలో తనతోపాటే ఉండేవారని ఆమె తెలిపారు. తన తండ్రి "సినిమాలు చేస్తే చెయ్యని, కానీ ఏ రోజు నా కూతురి కంటి నుంచి ఒక నీటి చుక్క కూడా బయటికి రాకూడదు, ఏమైనా జరిగితే దానికి బాధ్యురాలు నువ్వే" అని తన తల్లికి చెప్పేవారని విజయ పంచుకున్నారు. సినీ రంగంలో ఆడపిల్లలకు ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడుతూ, "మన క్యారెక్టర్‌ని బట్టి ఉంటుంది ప్రతీది. మనం వేసే ప్రతి అడుగు జాగ్రత్తగా వేశామంటే అక్కడ ఎదుటి వాళ్లకు ఆ ఛాన్సే లేదు" అని చెప్పారు. తన తల్లిని చూస్తే ఎవరూ తనను అప్రోచ్ అవ్వడానికి ధైర్యం చేసేవారు కాదని, తన తల్లి మాటలు అందరితో జాలిగా ఉన్నా, తాను మాత్రం సీరియస్‌గా తలదించుకుని ఉండేదాన్ని అని తెలిపారు.

శోభన్ బాబుతో జరిగిన ఓ సరదా సంఘటనను వై. విజయ గుర్తుచేసుకున్నారు. శోభన్ బాబు తనను చూసి "ఏం చదివావ్, ఏ ఊరి నుంచి వచ్చావ్, నీ వయసెంత?" అని అడిగారని, "నా వయసులో నీకు సగం వయసు ఉందా?" అని అడగగా, అప్పుడు తాను 13 ఏళ్లని చెప్పానని వివరించారు. దానికి శోభన్ బాబు ఆశ్చర్యపోయి, "13 ఏళ్లా, ఇంత ఎత్తు ఉన్నావ్, ఏం చదివావ్, టెన్త్ వరకు చదివాను సార్, నైన్త్ ఫుల్ ఫినిష్ చేశాను. 18 ఏళ్లు లేవంటున్నావు. 13 ఏళ్లు.! ఏ ఊరు.. కడప సార్, మరి ఇంత తెల్లగా ఎలా ఉన్నావ్" అని అడిగారని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో సిగ్గు పడే తన స్వభావం వల్ల శోభన్ బాబు ఉద్దేశాన్ని తాను సరిగా అర్థం చేసుకోలేదని విజయ తెలిపారు.





## 100 రోగాలకు ఈ ఒక్క ఆకుతోనే పరిష్కారం

ఉరుకులు పరుగుల ఆధునిక కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఆయుర్వేదం ప్రాధాన్యత గణనీయంగా పెరుగుతోంది. ప్రకృతి మనకు అందించిన అద్భుత ఔషధ మొక్కలలో రణపాల ఒకటి.. రణపాల ఆకులలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. ఇవి ఎన్నో సమస్యలను దూరం చేసి.. శరీరానికి అద్భుత ప్రయోజనాలు అందిస్తాయి. అందుకే.. దీనిని వంద రోగాలకు ఒక్కటే ఔషధంగా వ్యవహరిస్తారు ఆయుర్వేద నిపుణులు.. రణపాల మొక్కలో ఉన్న గొప్పతనం ఏమిటంటే, ఇది శరీరంలో వచ్చే దాదాపుగా అన్ని రోగాలపై అద్భుతంగా పనిచేస్తుంది. తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, రక్తపోటు, మధుమేహం (డయాబెటిస్), పుండ్లు, చర్మ వ్యాధులు, వేడి పొక్కులు, గుండె వ్యాధులు, మూత్రనాళాలకు సంబంధించిన సమస్యలు, రక్త శుద్ధి, జుట్టు పటుత్వం, గ్యాస్ట్రిక్ అల్సర్లు, మోకాళ్ళ నొప్పులు, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ఇలా అనేక రకాల ఆరోగ్య సమస్యలకు రణపాల ఏకైక పరిష్కారంగా చెప్పవచ్చు. రణము అంటే శోధన, పాల అంటే దాన్ని శాసించేది అనే అర్థం.. అందుకే.. రణపాల ఆకుని లీఫ్ ఆఫ్ లైఫ్ అని కూడా పిలుస్తారు. దీనికి జీవాన్నిచ్చే శక్తి ఉంటుంది కాబట్టే ఈ పేరు వచ్చిందంటున్నారు ఆరోగ్య నిపుణులు..


శాస్త్రీయంగా దీన్ని బ్రయోఫిల్లం అని అంటుంటారు. బ్రయోఫిల్లం అంటే స్వయంగా మొలకెత్తే ఆకు అని అర్థం. ఈ ఆకుని మట్టిలో వేసినా, ఆకు అంచుల నుంచి కొత్త మొక్కలు పుట్టుకొస్తాయి. ఈ రణపాల మొక్క 10 నుండి 15 రోజుల పాటు నీళ్ళు పోయకపోయినా కూడా వాడిపోకుండా ఉంటుంది. వీటిలో కొంత నీరు నిల్వ ఉండటం వలన వీటిని సక్కుంబలెంట్ లీవ్స్ అని కూడా అంటారు. కేథడ్రల్ బెల్స్, కలాంచోయే పిన్నాటా, పత్తర్ చట్టా వంటి పేర్లతో రణపాల ఆకుని వివిధ భాషల్లో పిలుస్తుంటారు.

రణపాల ఆకు ప్రధాన ప్రయోజనాలలో ఒకటి కిడ్నీలో రాళ్లకు బ్రహ్మాస్త్రంలా పనిచేయడం. ఈ ఆకుని కషాయంలా చేసుకొని తాగితే, కిడ్నీలో రాళ్లతోపాటు మూత్రాశయంలో అడ్డంకులన్నీ తొలగిపోతాయి. రణపాల ఆకుని మెత్తగా నూరి గాయాలపైన, వేడి పొక్కుల పైన పూతలా రాసుకుంటే, పుండు రెండు రోజుల్లో నయం అవుతుంది. రణపాల ఆకులపై ఉప్పు రాసి నమిలినా చాలు, ఆ రసం రక్తశుద్ధికి బాగా ఉపయోగపడుతుంది. ఇది రక్తంలో మలినాలన్నింటినీ తొలగించడమే కాకుండా, రక్తనాళాల్లో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను కూడా తొలగించి రక్త ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చేస్తుంది.

రణపాల ఆకులను మెత్తగా నూరి జ్యూస్ లా తాగితే గ్యాస్ట్రిక్ అల్సర్లు దరిచేరవు. రణపాల ఆకుల జ్యూస్ అద్భుతమైన ఇమ్యూనిటీ బూస్టర్ కూడా. అంతేకాదు, ఈ ఆకులో ఉన్న యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ అలర్జిక్, యాంటీబయాటిక్ గుణాలు కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, తలనొప్పి, మెడనొప్పి వంటి ఎటువంటి రోగానికైనా అద్భుతంగా పనిచేస్తాయి.

రణపాల ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది దాదాపు 30-40 రోగాలకు ఒక్కటే మందుగా పనిచేస్తుంది. ఈ మొక్కని మనమందరం మన ఇళ్ళల్లోనే పెంచుకోవచ్చు. ఎలాంటి నేలపై అయినా ఈ మొక్క బ్రతుకుతుంది. పెరట్లోనే ఈ మొక్కని పెంచుకుంటూ, రోజూ ఆ చెట్టు ఆకులని తింటుంటే ఎటువంటి అనారోగ్యాలు దరిచేరవని ఆయుర్వేదం తెలియజేస్తోంది.

మీకు ఏమైనా సమస్యలుంటే.. రణపాల వినియోగించే ముందు.. వైద్య నిపుణులను లేదా ఆయుర్వేద నిపుణులను సంప్రదించండి..



## తిప్ప తీగ కషాయం ఇలా మాత్రమే తాగండి...

తిప్పతీగ, ఆయుర్వేదంలో అమృతవల్లి లేదా గుడిచిగా పిలవబడే ఒక ప్రాచీన ఔషధ మొక్క. దీనికి గిలాయ్ అనే మరో పేరు కూడా ఉంది. ఈ పాదు చాలా విస్తారంగా పెరుగుతుంది. ముఖ్యంగా తుమ్మచెట్లపైన, గోడలపైన, ఫెన్సింగ్‌లపైన సాధారణంగా కనిపిస్తుంది. దీని కాండం, ఆకులు రెండూ ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. తిప్పతీగ ఆకు హృదయాకారంలో ఉండటం, తుంచినప్పుడు పాలు రాకపోవడం వంటి లక్షణాలతో దీనిని సులభంగా గుర్తించవచ్చు. ఆకుపైన ఆకుపచ్చగా, వెనుక భాగంలో తెలుపు రంగులో ఉంటుంది. తిప్పతీగకు ఆయుర్వేదంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇది అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించే సామర్థ్యం కలిగి ఉండటం వల్ల దీనిని అమృతంతో సమానంగా భావిస్తారు. ఇది శరీరంలో రోగనిరోధక వ్యవస్థను వేగంగా ఉత్తేజపరిచి, రక్షణ వలయాన్ని ఏర్పరుస్తుంది.

ఒకరి నుంచి ఇంకొకరికి సోకే వ్యాధులకు, ముఖ్యంగా వైరల్ జ్వరాలకు ఇది సమర్థవంతమైన ఔషధం. అలర్జీలను అదుపు చేయడమే కాకుండా, దీర్ఘకాలిక దగ్గు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలను కూడా నివారిస్తుంది. టాన్సిల్స్ సమస్యలను తగ్గిస్తుంది. దీనిలోని యాంటీబయోటిక్ గుణాలు క్యాన్సర్‌ను నిరోధించి, కొత్త కణాల అభివృద్ధికి దోహదపడతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు తిప్పతీగ ఒక వరం. ఇది ఇన్సులిన్‌ను నియంత్రించి, రక్తంలోని గ్లూకోస్ స్థాయిని అదుపు చేయడంలో సహాయపడుతుంది. అప్పుడప్పుడు తిప్పతీగ కషాయాన్ని సేవించడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గి బరువు తగ్గడానికి కూడా తోడ్పడుతుంది. పచ్చి తిప్పతీగ కాయలు ఆకుపచ్చ రంగులో ఉండి, పండిన తర్వాత ద్రాక్ష గుత్తుల వలె ఎరుపు రంగును సంతరించుకుంటాయి. తిప్పతీగ పొడిని పాలతో కలిపి తీసుకుంటే కీళ్ల సంబంధిత వ్యాధులను ఎదుర్కోవచ్చు.

## హైలైట్స్: ఇషాన్, హార్దిక్ కౌంటర్-అటాక్, నమీబియా బౌలర్లు షాక్‌లో!

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ మరియు హార్దిక్ పాండ్యా ఫార్మ్‌ఫుల్ ఇన్నింగ్స్ ప్రదర్శించారు. ఇషాన్ కిషన్ 24 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సలతో 61 పరుగులు చేసి క్రీజ్‌ను జల్లెడ చేయగా, హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 52 పరుగులు చేసి భారతానికి మంచి స్కోరింగ్ స్థిరత్వాన్ని ఇచ్చారుముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసింది. నమీబియా బౌలర్లు బాగా కట్టుబట్టిన బౌలింగ్‌తో భారీ స్కోర్ సాధించడాన్ని అడ్డుకున్నారు. నమీబియా కెప్టెన్ గెర్‌హార్డ్ ఎరాస్మస్ 4/20తో నాలుగు వికెట్లు తీశారు. అలాగే, బెన్ షికోంగో, జేజే స్మిత్, బెర్నార్డ్ స్కాల్ట్జ్ ఒక్కో వికెట్‌ను తీశారు.ఓపెనర్లు ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ జోరుగా ఇన్నింగ్స్ ప్రారంభించారు. సంజూ శాంసన్ 22 పరుగులు చేసి అనవసర షాట్‌తో అవుట్ అయినప్పటికీ, ఇషాన్ కిషన్ తిలక్ వర్మతో కలిసి పరుగుల ధాటిని కొనసాగించాడు. 6వ ఓవర్‌లో జేజే స్మిత్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ వరుసగా 4 సిక్సలు, 1 ఫోర్ కొట్టి 20 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు.ఇషాన్ కిషన్ విరుచుకుపాటు తరువాత, నమీబియా బౌలర్లు ఫీల్డ్‌లో తలపట్టారు. కెప్టెన్ ఎరాస్మస్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ క్యాచ్ అవుట్ అయ్యాడు. రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది.తరువాత సూర్యకుమార్ యాదవ్ (12), తిలక్ వర్మ (25) విఫలమైనప్పటికీ, హార్దిక్ పాండ్యా మళ్లీ ఫార్మ్‌లోకి వచ్చాడు. భారీ సిక్సర్లతో బౌలర్లను కలకలం రేపాడు. గెర్‌హార్డ్ బౌలింగ్‌లో హాఫ్ సెంచరీ సాధించిన హార్దిక్ మరుసటి బంతికే అవుట్ అయ్యాడు. ఆ తర్వాత శివమ్ దూబే 23 పరుగులు చేసి రనౌటవ్వగా, చివరి బంతిలో అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చివరి ఓవర్‌లో రింకూ సింగ్, అర్ష్‌దీప్ సింగ్ కూడా అవుట్ కావడంతో, భారత్ 230 పైగా స్కోరు సాధిస్తుందని భావించినా 209 పరుగులకే పరిమితమైంది.



## టీ20 ప్రపంచకప్‌లో నేపాల్‌పై ఇటలీ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం

టీ20 ప్రపంచకప్ 2026లో ఇటలీ జట్టు సంచలనం సృష్టించింది. టోర్నీలో తమ తొలి విజయాన్ని అత్యంత ఘనంగా నమోదు చేసింది. గురువారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో, ఇటలీ ఏకంగా 10 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. సోదరులైన ఓపెనర్లు జస్టిన్ మొస్కా, ఆంథోనీ మొస్కా విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగి, ఒక్క వికెట్ కూడా పడకుండా తమ జట్టును గెలిపించారు. ఈ టోర్నీ చరిత్రలోనే ఇటలీకి ఇది తొలి విజయం కావడం విశేషం.నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో, ఇటలీ ఓపెనర్లు ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కు గట్టిపోటీ ఇచ్చిన నేపాల్ బౌలర్లకు వారు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. పవర్‌ప్లే ముగిసేసరికి ఇటలీ వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. ముఖ్యంగా జస్టిన్ మొస్కా 44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో అతని సోదరుడు ఆంథోనీ మొస్కా మరింత దూకుడుగా ఆడి కేవలం 32 బంతుల్లో 3 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 62 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 12.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.ఈ క్రమంలో ఈ సోదరులు ఓ అరుదైన రికార్డును కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. టీ20 ప్రపంచకప్‌లో తోబుట్టువులు నెలకొల్పిన అత్యధిక భాగస్వామ్యం (124లి) రికార్డును సృష్టించారు. గతంలో 2014లో పాకిస్థాన్‌కు చెందిన కమ్రాన్ అక్మల్, ఉమర్ అక్మల్ నెలకొల్పిన 96 పరుగుల భాగస్వామ్యాన్ని వీరు అధిగమించారు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నేపాల్, ఇటలీ బౌలర్ల ధాటికి 19.3 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. ఇటలీ బౌలర్ క్రిషన్ కలుగామగే (3/18) కీలక వికెట్లు పడగొట్టి నేపాల్ పతనాన్ని శాసించాడు. నేపాల్ జట్టులో ఆసిఫ్ షేక్ (26), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (23) మాత్రమే కాస్త రాణించారు. ఒక దశలో 98 పరుగులకు 5 వికెట్లతో ఉన్న నేపాల్, చివరి 25 పరుగులకే మిగిలిన 5 వికెట్లను కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.